# చిట్టి కథ

- జెన్



## కట్నం

పిచ్చివాడు!
గుండెల్లో
చోటిచ్చిన
అమ్మాయిని
కాదని..
ఖరీదైన
ఫ్లాటిచ్చిన
అమ్మాయిని
చేసుకున్నాడు.



## వీడ్కోలు

నేను బస్సు ఎక్కాను.
నాకు వీడ్కోలు ఇవ్వడానికి వచ్చిన
ఇద్దరు స్నేహితురాళ్లు
వెనుదిరిగారు.
'ఇద్దరిలో ఆ నీలం టీషర్ట్
అమ్మాయికి నువ్వంటే ప్రేమ'
చెప్పాడు పక్క సీట్లోని కజిన్.
'నీకెలా తెలుసు?' అడిగాను.
'ఎవరైనా
వీడ్కోలు చెప్పగానే
వెళ్లిపోతారు.
ఆమె మాత్రం
తిరిగి తిరిగి చూస్తూ..
వెళ్లలేక వెళ్లింది'
విశ్లేషించాడు.



## ఎలక్షన్స్

శవం కింద
నోట్ల కట్టలతో
అంబులెన్స్
రాష్ట్ర సరిహద్దులు
దాటింది.
అందులో ఒక్కకట్ట ఉన్నా..
ఆ పేద రోగి బతికేవాడు.



## రాత్రి-పగలు

'ఇప్పటికీ నువ్వు
ప్రతి రాత్రీ
కలలోకి
వస్తుంటావు.
పగలు ఒకర్ని
రాత్రి ఒకర్ని
ప్రేమించడం
ఎలా సాధ్యం చెప్పూ?'
.. ఇంట్లో రెండో పెళ్లి
ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ
అతని ఫొటో ముందు
వాపోతూ ఉంటుందామె.



## సాకు

మా ఇంటికొచ్చిన
ప్రతిసారీ
అతను
ఏదో ఒకటి
వదిలి వెళ్తాడు.
మతిమరుపు కాదు.
మళ్లీ రావడానికి సాకు.